# తులాభారం

** రచన: పి. వి. కృష్ణమూర్తి **

"నాకు నమ్మకం లేదు" అంది కొట్టివచ్చేటట్టు విసురుగా సత్యభామ.

"నిజం తల్లీ" అంది దాసీ అపరంజి కాస్త భయపడుచూ.



"చాల్లే! వెర్రి కబుర్లూ నువ్వూను."

"కావాలిస్తే చూడండి" అంది అపరంజి.

"ఏమిటి నీ మొహమా చూసేది, నువ్వనేమాటలు కాస్త సబబుగా వుండాలా?"

"ద్వారక, ద్వారకంతా అక్కడికి వచ్చి ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకు చూస్తోంది."

"వెర్రి మొహమా లేతే సరి? ఒక్క తులసీ దళానికి అంత బరువు ఏడిసిందేం?"

"ప్రభావం తల్లీ" అంది అపరంజి జంకుతూ.

"ఎవరిదీ?!" అంది సత్యభామ కొఱకొఱలాడతూ.

"రుక్మిణిది తల్లీ! ఆమె మహాపతివ్రత."

సత్యభామ కండ్లెఱ్ఱ జేసింది "అవుతే నేను రంకులాడినన్న మాట" అంది. అపరంజి గజగజవణికి పోయింది. "రామ, రామ, నే నన్నానా ఆ మాట" అంది చెంపలు వాయించుకుంటూ.

"అవుతే నువ్వనే మాటలకి అర్థమేమిటీ? నిలువెత్తు బంగారం పోస్తే పిసరంత పైకిలేవని కృష్ణుడు ఒక్క తులసీ దళానికి పైకి లేచాడా? నమ్మతగ్గవేనా నీ మాటలు?"

"నేను కళ్ళారా చూస్తే...?"

"ఆమె తులసి వేస్తూండగా నువ్వు చూశావా?"

"లేదు తరవాత వెళ్ళి చూశాను జనం అక్కడ మూగితే. తులసి వున్న వైపు బాగా నేలకు అంటుకుని వుంది. అవతలి వైపు ప్రభువు అసలు బరువులేనట్టు పైకి వున్నాడు. అదేం మహిమో?"

"మహిమ! వూరంతా తిప్పుకొచ్చాడుగా నారదుడు. ఎవరు తూచగలిగితే వారికి సాననీ. ఇంతమంది భార్యలకూ లేని పాతివ్రత్యం దీనికొక్కదానికే ఏడిసిందేం, అప్పుడే నాముందు చూపలేకపోయిందీ."

"మీ రామెను పిలవలేదుగా?"


"ఎందుకు పిలవాలేం ఈ మాయదారి వాళ్ళని. పద, దీని అంతేమిటో కనుక్కుంటాను ఇవ్వాళ.

ఇంకా అక్కడే వున్నారా వాళ్ళంతా ?"

"ఆ! మీకోసమే అంతా యెదురు చూస్తున్నారు."

"అలాగేం?" అంటూ అపరంజితో బయలుదేరింది. పెద్ద తోటలోకి సత్యభామ.

ఇసుక వేస్తే నేల రాలకుండా మూగి వున్నారు జనులు అక్కడ. ఎవరి నోటివెంట వచ్చినా "ఆహా! ఏమి పాతివ్రత్యం! ఏమి పాతివ్రత్యం" సాక్షాత్ మహాలక్ష్మి అవతారం అన్న మాటలే. సత్యభామకు సూదుల్లాగా గుచ్చుకుంటున్నై ఆ మాటలు. తుపానులాగా ఆ జనసమూహాన్ని తోసుకుని వెళ్ళింది లోపలికి. అంతా అపరంజి వర్ణించినట్టుగానే వుంది అక్కడ. "దిమికిట దిమికిట" అని పాడుతూ గెంతుతున్నాడు నారదుడు. రుక్మిణి యేదో ధ్యానం చేస్తూ నిలబడి వుంది కళ్ళు మూసుకుని. కళ్ళారా చూస్తున్నా వొక్క తులసీదళంతో కృష్ణుడు పైకి లేవడ ఆమె నమ్మకం లేక పోయింది.



"ఏమిటిదంతా" అంది మండిపడుతూ సత్య.

"చూస్తున్నావుగద చెల్లీ" అంది కళ్ళు తెరచి శాంతస్వరంతో రుక్మిణి.

"ఏమిటీ చూసేదీ...వొక్క తులసీ దళంతో ఆయన తూగడమా."

"అది పాతివ్రత్యప్రభావం చెల్లీ! నీకు తెలీదు."

సత్యభామ తోకదొక్కిన త్రాచుపాములాగా లేచింది. "ఆఁ! ఏమన్నావ్! నాకు పాతివ్రత్యం తెలీదా? ఇప్పుడు చూపిస్తా నుండు నా పాతివ్రత్యం, ఏదీ ఆ తులసీ దళం తీసి మళ్ళీ వేయి చూదాం" అంది. అక్కడ మూగినా జనులంతా విస్తుపోయి చూస్తున్నారు. రుక్మిణి "నాలాంటి పతివ్రతలు ఆ కాస్త తులసీదళం కూడా వెయ్యక్కఱలేదు చెల్లీ, అది తీసివేసినా ఫరవాలేదు" అంటూ ఆ తులసీదళం కూడా త్రాసులోంచి తీసి వేసింది. కాని కృష్ణుడు పైకే వున్నాడు. ఈసారి సత్య నిజంగానే విస్తుపోయింది. ఐనా "ఆయన్ని ఇవతల దాంట్లో కూర్చోబెట్టి అవతలిదాంట్లో తులసి వెయ్యి" అంది. ఈ మాటతో రుక్మిణి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. "ఇది చాలదా సత్యా" అన్నాడు నారదుడు. "నాకు నమ్మకం లేదు" అంది సత్య. కృష్ణుడు తెల్లబోయి చూస్తున్నాడు. రుక్మిణి కదలకపోవడం చూసి. "నేననుకుంటూనే వున్నా ఇందులో యేదో మోసం వుంటుందని" అంది. రుక్మిణికి రోషం వచ్చింది. కృష్ణున్ని యివతలి వైపు కూర్చోబెట్టి అతని పాదాలను ధ్యానిస్తూ అవతలివైపు తులసి వేసింది. జనులంతా ఆశ్చర్యంతో చూస్తున్నారు. కాని, నార్త్ పోల్ దగ్గరి సూర్యుడిలాగా మహిమే లేకుండా పోయింది ఆ తులసీదళం. కృష్ణుడు కిందే వున్నాడు. సత్య కృష్ణుణ్ణి లేవమంది. అయినా ఆ వైపు తట్ట




# దొంగవర్తక వినాశనానికి

## అతడు సహాయపడుతున్నాడు

---

దేశీయ యుద్ధరంగ ప్రచురణ

AAA 1384B

కిందే అంటుకుని వుంది. సత్య ఆశ్చర్యంతో దాన్ని పైకెత్త బోయింది. బరువుగా కాస్త పైకి లేచిన ఆ తట్ట వదిలిపెట్టగానే యెవరో లాగినట్టు మళ్ళీ నేల కతుక్కుంది. అయినా వదలకుండా నలుగురు కూలీలచేత ఆ తక్కెడను ఇవతలకు బలవంతంగా లాగించింది. ఆ చోట ఏదో కనపడీ కనబడకుండా పతి పెట్టబడుంది. ఇనప గడ్డపారలతో తియ్యబోతే అవికూడా దాని కంటుకోడం మొదలు పెట్టినె. అతి కష్టంమీద తవ్వితే దానిలోనుండి వొక పెద్ద సైజుది, మంచి శక్తి గలది, అయస్కాంతం బయటపడింది. సత్యభామ దాన్ని చూసి రుక్మిణి తో "ఇదా నీ పాతివ్రత్యం?" అంది. జనులంతా వింతగా నోళ్ళు తెరిచారు. అక్కడే వున్న అపరంజి "ఇదే గాబోలు పొద్దున్న మీరు బంగారంతో తూస్తున్నప్పుడు ఈ వైపుకు సూటిగా పైన చెట్టు కొమ్మకు ఆకుల మధ్య కట్టేసుంది. ఏమిటో ననుకున్నా" అంది.

"అమ్మయ్యో? యెంత నాటకం. ఒక వైపు ఆయన కూర్చుంటే మరొక వైపు ఇది లాగుతోంది పైకి. ఇక నేను ఎంత బంగారం పెడితేనేం? ఇదంతా దేవర్షి సహాయం గాబోలు. ఇనప త్రాసు వేస్తేగాని వల్లకాదంటూ కూర్చున్నాడు. ఇందుకే కాబోలు."

"మనమంతా వెళ్ళిన తరువాత దాన్ని విప్పి కింద పాతించినట్టుంది" అంది అపరంజి.

"అసలు మా యింట్లోనే వ్రతం చేద్దామంటే. ససేమిరా వొద్దంటూ ఈ దిక్కున ఈ చెట్టు కిందే యేడవాలంటే సరేగదా ననుకున్నా. ఇట్లా నాటక మాడతారని నాకేం తెలుసూ? దీని పాతివ్రత్యం బయటపెట్టాలని గాబోలు ఈ నాటకమంతా. పుట్టింటిలోంచి చెప్పకుండా లేచి వచ్చినదానికి పాతివ్రత్య మేమిటీ?" అంటూ కృష్ణుడి చెయ్యి పట్టుకుని గబగబ లాక్కు వెళ్ళిపోయింది. అపరంజితో జనులంతా ముక్కుమీద వేలు వేసుకున్నారు.


**S. S. S.**

# కొద్దిమొత్తములు కూడబెట్టే పద్ధతి

## అధికారముపొందిన ఏజంటుగా ఎందుకు ఉండకూడదు?

### నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్లను

$2\frac{1}{2}\%$ కమీషనుమీద అమ్మండి. మీరు తీరికసమయాల్లో పనిచేసినా
పూర్తిగా ఇందుకే పనిచేసినా చక్కగా ఆర్జించవచ్చు.
అమ్మిన ఒకొక్క రు 10 ల సర్టిఫికెటుకూ అ. 4 వస్తుంది.

మీ రీ ఉద్యోగం కావాలనుకుంటే ఈ క్రింది వివరాలను మీరు బయటిజిల్లాలలో ఉంటే మీ కలక్టరుకుగాని, మద్రాసు పట్టణంలో ఉంటే నేషనల్ సేవింగ్సు సర్కిల్ ఆఫీసరు, 'విక్టరీహౌస్' మద్రాసుకుగాని వ్రాయండి.

1. పేరు, అడ్రసు. 2. వయస్సు. 3. మీకు స్థిరాస్తి ఏమైనా ఉంటే అది ఏమి ? ఎచ్చటఉన్నది. 4. లేకపోతే మీరే గవర్నమెంటు అధికారులకు స్వయముగా తెలిసియున్నారు. 5. లేకపోతే రిఫరెన్సుకు తగిన ఇతరపేర్లను, అడ్రసులను ఇవ్వండి. 5. విద్యాయోగ్యతలు. 6. ఇప్పుడేమైన ఉద్యోగముంటే, అది.

A. A. & S. N. S. 10.